సాక్షి
మహబూబాబాద్
సోమవారం । 6 । జనవరి । 2025



'మిరప'కు తెగుళ్ల బెడద..

మిరపకు నల్లతామర శాపంగా మారుతోంది. నల్లతామర ప్రధానంగా ఆకులు, పువ్వులపై పెద్ద సంఖ్యలో చేరి రసం పీల్చడంతో ఆకులు మాడిపోతున్నాయి. - 8లో▸



ఓ సిటీ వేలం వాయిదా..

'కుడా' ఆధ్వర్యంలో 'ఓ సిటీ'లో ప్లాట్లు విక్రయించేందుకు ఆదివారం నిర్వహించిన వేలానికి కొనుగోలుదారుల నుంచి స్పందన లభించలేదు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
34.8^0 / 14.2^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కమిషన్ ఏర్పాటు చేయాలి



కేసముద్రం: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర చైర్మన్ గోధుమల కుమారస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులందరికీ నివాస స్థలాలు కేటాయించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పింఛన్ మంజూరు చేయాలన్నారు. అనంతరం ఉద్యమకారుల పలు డిమాండ్లపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సంఘం మండల ఫోరం అధ్యక్షుడు చాగంటి కిషన్, కన్వీనర్ రామ్మూర్తి, భారత్ బచావో జాతీయ కమిటీ సభ్యుడు జైసింగ్ రాథోడ్, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గడ్డం సదానందం, పీసీసీ సభ్యుడు దస్రూనాయక్, బట్టు శ్రీను, మహేశ్వరాచారి, మాంకాల కట్టమల్లు, షేక్ ఖాదర్, దండు శ్రీనివాస్, రాజ్‌కుమార్, రేవంత్, మురళి, అంకూస్, మధుకర్, యాకన్న, చిట్యాల వీరన్న, బాలు మోహన్, నర్సింహారెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

టీసీసీ టెక్నికల్ పరీక్షలు

మహబూబాబాద్ అర్బన్: టీసీసీ టెక్నికల్ కోర్సు సర్టిఫికెట్ల పరీక్షలు ఈ నెల 11నుంచి 17వరకు నిర్వహిస్తామని డీఈఓ రవీందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, గుమ్ముడూరు బాలికల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో www.bse.telangana.govt.in వెబ్‌సైట్‌లో జిల్లా పేరు, ట్రేడ్ కోడ్, పేరు, జనన ధ్రువీకరణ తేదీని నమోదు చేసుకొని హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఏసీజీఈ మందుల శ్రీరాములు 9849761012 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఎస్‌ఎల్‌టీఏ జిల్లా కమిటీ



ప్రవీణ్ కుమార్, అధ్యక్షుడు



అమర్, ప్రధానకార్యదర్శి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం (ఎస్‌ఎల్‌టీఏ) జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తులు శ్రీనివాసులు, ప్రధాన కార్యాదర్శి కర్రెం గౌరిశంకర్ ఆదివారం తెలిపారు. అధ్యక్షుడిగా ముడుంబై ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శీలమంతు అమర్, కార్యవర్గ సభ్యులుగా రామచంద్రు, సత్యం, విలియమ్స్, సురేష్, ప్రసాద్, యుగంధర్, మోహన్, వహీద్, శ్రీనివాస్, మహిళా సభ్యులుగా మంజుశ్రీ, సంగీత, సునీత, అరుణను ఎన్నుకున్నారు. అదే విధంగా గుర్రాల ఉమారాణిని రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు


వరంగల్ క్రైం: కమిషనరేట్ పరిధిలో ఎవరైనా ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాలు విక్రయించినా.. వినియోగించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. గాలి పటాల విక్రయదారులు అమ్ముతున్న నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసిన చైనా మాంజాలు మనుషులతో పాటు పక్షులకు ప్రమాదకరమని పేర్కొన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు పర్యావరణ విపత్తుకు కారణమయ్యే చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. కొద్ది రోజులుగా టాస్క్‌ఫోర్స్, పోలీసుల ఆధ్వర్యాన నిర్వహించిన తనిఖీల్లో సుమారు రూ.2.65 లక్షల విలువైన చైనా మాంజాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రాధాన్యతను కోల్పోని శతక ప్రక్రియ

హన్మకొండ కల్చరల్ : పన్నెండవ శతాబ్దంలో తెలుగుభాషలో మొదలైన శతక ప్రక్రియ నేటి వరకు తన ప్రాధాన్యత కోల్పోకుండా సమాజాన్ని ప్రభావితం చేస్తున్నదని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య అన్నారు. ఆదివారం హనుమకొండలోని ప్రాక్టీసింగ్ ప్రైమరీ స్కూల్‌లో కాకతీయ పద్యకవితా వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో చిదిరాల సుధాకర్ రచించిన పద్య పంచశతకము ×జీవనపోరాటం× పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కవి సమ్మేళనంలో 30 మంది కవులు తమ కవితలతో అలరించారు. సమస్యాపృచ్ఛక చక్రవర్తి కంది శంకరయ్య అధ్యక్షతన జరిగిన పుస్తక సమీక్షకులుగా చేపూరి శ్రీరాం, కేయూ తెలుగు అధ్యాపకులు డాక్టర్ మంథని శంకర్ పాల్గొన్నారు.

ఆపదలో ఆమె!

- ఆందోళనకరంగా లింగ నిష్పత్తి
- 1000మంది పురుషులకు 836మంది మహిళలు
- రాష్ట్రంలో చివరి స్థానంలో మహబూబాబాద్
- తేల్చి చెప్పిన ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ సర్వే
- జిల్లా పరిస్థితిపై ఎన్‌ఐఎంసీ సీరియస్



సాక్షి, మహబూబాబాద్: సృష్టికి మూలం స్త్రీ, అన్ని రంగాల్లో పురుషులకు సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. అయితే లింగనిష్పత్తి మాత్రం వెనకబడిపోతున్నారు. ఇటీవల జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో స్త్రీ, పురుషుల సెక్స్‌రేషియోలో భారీ వ్యత్యాసం ఉందని తేలింది. లింగ నిష్పత్తిలో ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత దేశం కాస్త వెనకబడి ఉండగా.. దేశంలో బాలికల జనంలో తెలంగాణ రాష్ట్రం వెనకబడి ఉంది. రాష్ట్రంలో మహబూబాబాద్ జిల్లా చిట్టచివరి స్థానంలో ఉన్నట్లు తేలింది. దీంతో మహబూబాబాద్ జిల్లాలో ఎందుకిలా అవుతుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసి.. ప్రత్యేక బృందాలను జిల్లాకు పంపించి కారణాలు తెలుసుకునే పనిలో ఉన్నారు.

రాష్ట్రంలో చివరి స్థానంలో జిల్లా..

రాష్ట్రంలోని 33జిల్లాల్లో లింగ వ్యత్యాసంలో జిల్లా చివర అంటే 33వ స్థానంలో ఉంది. ఇటీవల దేశ వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో లింగ నిష్పత్తి భారతదేశంలో ప్రతీ వెయ్యి మంది పురుషులకు 894 మహిళలు, రాష్ట్రంలో 879 మహిళలు ఉన్నారు. అయితే రాష్ట్రంలో అతి తక్కువగా మహబూబాబాద్ జిల్లాలో ప్రతీ వెయ్యి మంది పురుషులకు 836మంది మహిళలు ఉన్నట్లు గుర్తించారు.

కారణాలు ఇవే కావచ్చు..

జిల్లాలో మహిళల నిష్పత్తి తగ్గడానికి గల కారణాలను తెలుసుకుంటున్నారు. ప్రధానంగా జిల్లాలో 60శాతానికిపైగా జనాభా గిరిజన, ఆదివాసీలు ఉండటం, అక్షరాస్యత తక్కువగా ఉండటం.. దీంతో మగ సంతానం కావాలనే ఆలోచనతో ఉంటున్నారు. ఈక్రమంలో గుట్టుగా లింగనిర్ధారణ పరీక్షలు చేసి ఆడపిల్ల అని తేలితే గర్భంలోనే చిదిమేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలోని కురవి, మహబూబాబాద్, తొర్రూరులో వెలుగు చూశాయి. వీటిని నిరోధించాల్సిన అధికారులు మామూళ్లకు ఆశపడి పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

ఎన్‌ఐఎంసీ సీరియస్

మహబూబాబాద్ జిల్లాలో లింగ నిష్పత్తి తగ్గడాన్ని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కౌన్సిల్ సీరియస్‌గా పరిగణించింది. అసలు విషయం తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాన్ని మానుకోటకు పంపించారు. ఇందులో భాగంగా డిసెంబర్ 19న ఢిల్లీ బృందం మహబూబాబాద్ వచ్చి పలు స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి సీజ్ కూడా చేసింది. అదేవిధంగా జిల్లాలోని భ్రూణ హత్యలు నివారించలేకపోవడంపై అధికారులపై కూడా కేంద్ర బృందం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.



జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసిన కేంద్ర బృందం(ఫైల్)

సమీక్షలు

లింగ నిష్పత్తిలో రాష్ట్రంలో జిల్లా వెనకబడి ఉండటం, ఉన్నతాధికారుల స్థాయిలో తీవ్ర చర్చ జరిగి జిల్లా అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. దీంతో ముందుగా జిల్లాలోని పీఎన్‌డీటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. తర్వాత జిల్లా వైద్యాధికారి కమిటీ సభ్యులతో సమీక్షలు చేసి లింగ నిర్ధారణ కేంద్రాలను తరచూ తనిఖీలు చేయడం, నిఘా పెంచడంపై ప్రత్యేక కమిటీని వేసినట్లు సమాచారం. ఈ కమిటీలో మాతాశిశు ఆరోగ్య కేంద్రం ప్రోగ్రాం ఆఫీసర్, స్త్రీ వైద్య నిపుణులు, తహసీల్దార్, పోలీస్ అధికారి ఉండేలా చూశారు. వీరందరూ ప్రతీ నెలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 59 స్కానింగ్ సెంటర్లను తనిఖీలు చేయడం, గర్భస్థ లింగనిర్ధారణ చేస్తున్న వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధం అవుతున్నారు.

స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా



జిల్లాలో స్త్రీ, పురుషుల లింగ నిష్పత్తిలో తేడా రావడానికి ప్రధాన కారణం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడమే. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక కమిటీ వేస్తున్నాం. లింగనిర్ధారణ నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

-మురళీధర్, డీఎంహెచ్‌ఓ

ఆందోళనకరమే..



స్త్రీ, పురుషుల జనన నిష్పత్తిలో జిల్లా చివరి స్థానంలో ఉండటం ఆందోళనకరమైన విషయం. భవిష్యత్‌లో మహిళల కొరత ఏర్పడుతుంది. దీనిని అరికట్టకపోతే ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడుతుంది. లింగనిర్ధారణ పరీక్షలు చేసేవారిపై కఠినంగా వ్యవహరించాలి. స్త్రీ, పురుషులు ఇద్దరు సమానమే అని ప్రజల్లో చైతన్యం తేవాలి.

-జగదీశ్, పీఎన్‌డీపీ సభ్యుడు

ప్రజల్లో చైతన్యం కల్పిస్తాం



సృష్టికి మూలం స్త్రీ, బాలికల జనాభా తగ్గడం అంటే సృష్టికి విఘాతం కల్గినట్లే. దీనిని స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా అందరం బాధపడాల్సింది. ప్రధాన కారణం మగ సంతానం కోసం తాపత్రయ పడటమే. ఇద్దరు సమానం అనే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. లింగనిర్ధారణ పరీక్షలు చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలి.

-నాగవాణి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్

ఘనంగా గోదాదేవి కల్యాణం

డోర్నకల్: పాత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా రంగనాథస్వామి సమేత గోదాదేవి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. బ్యాంక్ స్ట్రీట్‌లోని గోపాల్‌వర్మ ఇంటి నుంచి పాత వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు రంగనాథస్వామి, గోదాదేవి విగ్రహాలను ఊరేగించారు. మహేశ్వరీ సేవాసమాజ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఆలయంలో కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్త్రీ, పురుషులు రాజస్తానీ సంప్రదాయ దుస్తులు ధరించి పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు.



డోర్నకల్‌లో గోదాదేవి సమేత రంగనాథస్వామి ఊరేగింపు వేడుకలు

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వేదికపై ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

- రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మూడు విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు శంకుస్థాపన
- అక్కంపేట గ్రామస్తులకు రెవెన్యూ గెజిట్ అందజేత
- మొగిలిచర్లలో బహిరంగ సభ

గీసుకొండ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ పరిధిలోని మొగిలిచర్ల, గొర్రెకుంట(గరీబ్‌నగర్), విశ్వనాథపురం గ్రామాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మొగిలిచర్లలో ఏర్పాటు చేసి బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఏడాది క్రితం ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల హామీలను నెరవేర్చిందని పేర్కొన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి యువ ఎమ్మెల్యేగా ఉత్సాహంగా పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని అభినందించారు. సబ్‌స్టేషన్ల ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు కరెంట్ కష్టాలు తీరి భవిష్యత్‌లో నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కోరిన నిధుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా అక్కంపేట రెవెన్యూ గెజిట్‌ను గ్రామస్తులకు అందజేశారు. ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి రూ.500 కోట్ల నిధులు మంజూరయ్యాయని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించుకుంటున్నట్లు పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి దామెర, సంగెం యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరకాల మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి సుమారు రూ.50 కోట్ల అంచనాతో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రూ.100 కోట్లతో రహదారులు, రూ.160 కోట్లతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో నాలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. మినీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి అవకాశాలను, డెయిరీ అభివృద్ధి చేస్తామని చెప్పారు. టీయూఎఫ్ ఐడీసీ కింద రూ.19 కోట్లు, సీవరేజ్ వాటర్ డ్రైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎంను కోరారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కేఆర్.నాగరాజు, మురళీనాయక్, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఉపకేంద్రాల శంకుస్థాపనలో పాల్గొన్న డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేలు, ఎంపీ తదితరులు

వివాదాల్లో విలువైన భూములు



కబ్జాకు ప్రయత్నాలు జరుగుతున్న ఆఫీసర్ క్లబ్‌స్థలం ఇదే



వివాదంలో ఉన్న విలువైన ఇందిరాగాంధీ సెంటర్‌లోని స్థలం

- మళ్లీ తెరపైకి మానుకోట మున్సిపాలిటీలోని స్థలాల ఇష్యూ
- ఆఫీసర్ క్లబ్ స్థలం, మరో జాగా కబ్జాకు యత్నాలు
- అన్యాక్రాంతం కాకుండా చూడాలని సీపీఐ ఆందోళన

మహబూబాబాద్: జిల్లా కేంద్రం నడిబొడ్డున విలువైన భూములు వివాదాల్లో ఉన్నాయి. వందల కోట్ల విలువైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఇటీవల సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఆ పార్టీ నాయకులతో పాటు మానుకోట మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఇందిరాగాంధీ సెంటర్‌లోని ఓ స్థలం విషయంలో కొన్ని సంవత్సరాల క్రితం రగడ జరగగా.. మళ్లీ తెరపైకి వచ్చింది. ఆఫీసర్ క్లబ్ స్థలం వివాదంలో ఉంది.

ఆఫీసర్ క్లబ్‌స్థలం..

జిల్లా కేంద్రంలోని కొత్తబజార్ 36వ వార్డు పరిధిలో సుమారు రెండెకరాల స్థలంలో ఆఫీసర్ క్లబ్ ఉంది. అక్కడి భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆ ప్రాంతంలో గజం ధర లక్షల్లోనే ఉంది. కాగా ఆ స్థలం విలువ రూ.50కోట్లపైనే ఉంటుంది. గతంలో ఆఫీసర్ క్లబ్ స్థలంతో పాటు దాని పక్కనే వ్యవసాయశాఖకు సంబంధించిన కార్యాలయాలు, గోదాంలు ఉండేవి. కాగా క్లబ్ స్థలం విడిచిపెట్టి.. కార్యాలయాలు, గోదాంల స్థలంలో మోడల్ మార్కెట్ నిర్మాణానికి పూనుకున్నారు. కాగా క్లబ్ స్థలం కబ్జాకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సీపీఐ ఆందోళన బాటపట్టింది. దీనిలో భాగంగానే ఇటీవల క్లబ్ ఆవరణలోనే సీపీఐ నాయకులు ఆందోళన చేశారు. అది ఆఫీసర్ క్లబ్ కాదని.. 1930లో వేసిన శిలాఫలకంపై మానుకోట క్లబ్‌గా ఉందని, కానీ కొంత మంది దానిని ఆఫీసర్ క్లబ్‌గా మార్చారని, వెంటనే దానిని స్వాధీనం చేసుకుని మున్సిపాలిటీకి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్‌తో పాటు కళాక్షేత్రం, ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాని ఆందోళన చేశారు. అలాగే మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న ఆధ్వర్యంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

ఇందిరాగాంధీ సెంటర్‌లో 2000 గజాల స్థలం

ఇందిరాగాంధీ సెంటర్‌లో సుమారు 2000 గజాల స్థలం వివాదంలో ఉంది. ఆ స్థలం తమదేనని కోఆపరేటివ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 2019 అక్టోబర్‌లో వేలం వేసేందుకు ఫెన్సింగ్ వేశారు. ఈ స్థలం విషయంలో అప్పటి మున్సిపాలిటీ అధికారులు, పాలక మండలితో పాటు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆ సమయంలో బ్యాంక్ అధికారులకు మున్సిపాలిటీ తరఫున నోటీస్‌లు ఇచ్చారు. స్థలం మాదంటే మాదే అని.. ఇటు మున్సిపాలిటీ అటు కోఆపరేటివ్ బ్యాంక్ అధికారులు వాదనకు దిగారు. అనంతరం గొడవ సద్దుమణిగింది. ప్రస్తుతం ఆ స్థలంలో ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. దాని విలువ కూడా రూ.50 కోట్లకు పైనే ఉంది. కాగా ఇటీవల ఆ స్థలం కబ్జాకు గురికాకుండా చూడాలని మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ స్థలం ముమ్మాటికి మున్సిపాలిటీదేనని, తమకు కేటాయిస్తే షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతామని వినతిలో పేర్కొన్నారు. కాగా స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, కలెక్టర్, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటే ఆ స్థలాల వివాదాలకు చెక్ పడుతుందని నాయకులు, ప్రజలు అంటున్నారు.

ఎమ్మెల్యే, ఎంపీ ప్రత్యేక చొరవ తీసుకోవాలి

ఆఫీసర్ క్లబ్ స్థలం విషయంలో ఎమ్మెల్యే మురళీనాయక్, ఎంపీ బలరాంనాయక్ ప్రత్యేక చొరవ తీసుకోవాలి. మానుకోట క్లబ్‌ను ఆఫీసర్ క్లబ్‌గా మార్చి దానిని కబ్జా చేసే కుట్రలు చాలా సంవత్సరాల నుంచి జరుగుతున్నాయి. ఆ స్థలంను స్వాధీనం చేసుకొని మున్సిపాలిటీకి కేటాయించి అభివృద్ధి చేయాలి. ఇందిరాగాంధీ సెంటర్‌లోని స్థలంను కూడా గతంలో వేలం వేసే కుట్రలు చేస్తే అడ్డుకున్నాం. వెంటనే ఆ స్థలాలను స్వాధీనం చేసుకొని మున్సిపాలిటీకి కేటాయించాలి.

-బి.అజయ్‌సారథిరెడ్డి
సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్

రైతు 'భరోసా' ఎందరికి!?

- ఎకరాకు ఏడాదికి రూ.12 వేలు
- ఈనెల 26వ తేదీ నుంచి అమలు
- కొత్త మార్గదర్శకాలు, దరఖాస్తులపై చర్చ
- 2024 యాసంగిలో 8.77 లక్షల మంది రైతులు
- ఈసారి సంఖ్య పెరుగుతుందా? తగ్గుతుందా?
- భూమిలేని రైతు కుటుంబాలకు ప్రయోజనం
- కసరత్తు ప్రారంభించిన అధికారులు



సాక్షిప్రతినిధి, వరంగల్ : రైతు భరోసాపై సాగుతున్న చర్చకు ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టింది. 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పేరిట ఈ పథకాన్ని అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది. కొత్త రేషన్ కార్డులతో పాటు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాన్ని ఈనెల 26 నుంచే అమలు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రకటించారు. సాగుకు యోగ్యమైన భూములు కలిగిన, అర్హులైన రైతులకు 'భరోసా'ఇవ్వనున్నట్లు చెప్పారు. తండాలు, గూడేలు, మారుమూల గ్రామాలు, పల్లెల్లో భూమిలేని వ్యవసాయ రైతు కుటుంబాలకు కూడా ఈ పథకం వర్తింపజేయనుండగా, పెట్టుబడి సాయం అందని అర్హులైన రైతులు మంగళవారం వరకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఈ నేపథ్యంలో కొద్ది నెలలుగా రైతు భరోసా అమలుపై వ్యక్తమవుతున్న అనుమానాలు, సందేహాలకు తెర పడినట్లయ్యింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,77,173 మంది..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత యాసంగి వరకు 8,77,173 మంది రైతులు రైతుబంధుకు అర్హులుగా ఉన్నారు. హనుమకొండ జిల్లాలో 1,50,982, వరంగల్ 1,54,405, జేఎస్ భూపాలపల్లి 1,16,574, ములుగు 76,692, జనగామ 1,85,937, మహబూబాబాద్‌లో 1,92,583 మంది రైతులకు గత యాసంగిలో రూ.880 కోట్ల మేర పంట పెట్టుబడి అందింది. ఆ తర్వాత వానాకాలంలో భరోసా కల్పించకపోవడంతో రైతులు పెట్టుబడి సాయం కోసం మళ్లీ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా గత ప్రభుత్వ హయాంలో ఎంత భూమి ఉన్నా ఎకరానికి ఏడాదికి రూ.10 వేల చొప్పున రైతుబంధు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఎకరానికి రూ.7,500 చొప్పున ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ఈ లెక్కన ప్రతీ సీజన్‌లో రూ.880 కోట్ల వరకు వచ్చే రైతుబంధు సాయం మరో రూ.440 కోట్లు పెరిగే అవకాశం ఉందని అధికారులు నివేదికలు పంపారు.


'ఉపసంఘం' పర్యటన తర్వాత నిర్ణయం..

రైతుభరోసా అమలుపై ప్రభుత్వం ఆరు నెలల కాలంలో వివిధ కోణాల్లో సమీక్ష సమావేశాలు నిర్వహించింది. ఇదే క్రమంలో గతేడాది జూలై 11 నుంచి 23 వరకు మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరుల బృందం జిల్లాల్లో పర్యటించింది. విభిన్నవర్గాలు, నిపుణులు, అధికారులు, రైతు సంఘాల నుంచి అభిప్రాయాలు సేకరించి.. పలు కోణాల్లో పరిశీలన, కసరత్తు అనంతరం శనివారం నిర్వహించిన కేబినెట్ భేటీలో తుది నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 26 నుంచి రైతు భరోసా పేరిట ఎకరానికి ఏడాదికి రూ.12 వేల చొప్పున రైతులకు పెట్టుబడి సాయం అందించనున్నట్లు ప్రకటించారు. కాగా, రైతులతో పాటు రైతుకూలీలకు భరోసా కల్పిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. తండాలు, గూడేలు, మారుమూల గ్రామాలు, పల్లెలోని భూమిలేని రైతు కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరిట ఏడాదికి రూ.12 వేలు చెల్లిస్తామని ప్రకటించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో భూమిలేని నిరుపేద కుటుంబాలకు, వ్యవసాయంపై ఆధారపడిన రైతుకూలీలకు భరోసా కలుగనుంది.

గత యాసంగిలో రైతుబంధు లబ్ధిదారులు, అందిన సాయం వివరాలు..

జిల్లా	రైతులు	నిధులు (రూ.లలో)
హనుమకొండ	1,50,982	136,08,18,594
వరంగల్	1,54,405	136,47,64,319
మహబూబాబాద్	1,92,583	203,80,86,807
ములుగు	76,692	79,18,74,092
జయశంకర్‌భూపాలపల్లి	1,16,574	117,47,18,093
జనగామ	1,85,937	206,70,50,167

ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఏడాదికి ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలి. రూ.12వేలకు తగ్గించడం సమంజసం కాదు. ఈ పథకం విధివిధానాలను మార్చి నిబంధనలను కఠినతరం చేయడం సరికాదు. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలతో రైతులకు అదనంగా ఒరిగేదేమీ లేదు. గత ఏడాదిగా ఎగ్గొట్టారు.

- మాచర్ల రఘురాములు,
రైతు, తానేదార్‌పల్లి (స్టేషన్‌ఘన్‌పూర్)

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అమలు..

ప్రభుత్వ మార్గదర్శకాలు, సూచనల మేరకు అర్హులైన రైతులకు 'భరోసా' లభిస్తుంది. ఇప్పటికే రైతు భరోసా పథకంపై రైతులు, రైతు సంఘాల నుంచి అభిప్రాయాలు సేకరించిన ప్రభుత్వం వీటిన్నంటినీ పరిగణనలోకి తీసుకొని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం పేరిట అమలు చేయనుంది. అయితే, సర్కారు నుంచి అందే కొత్త మార్గదర్శకాల అనంతరం రైతులకు పెట్టుబడి సాయం అందుతుంది.

- కె.దామోదర్‌రెడ్డి, ఏడీఏ, నర్సంపేట

మేడారంలో భక్తుల సందడి

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. జంపన్నవాగు స్నానఘట్టాల వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాప్‌ల వద్ద స్నానాలు చేశారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీర, సారె, ఒడి బియ్యం, ఎత్తు బంగారం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజుకు పూజలు నిర్వహించారు. మొక్కుల అనంతరం భక్తులు వంటావార్పు చేసుకున్నారు. 10వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు.



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

రామప్ప.. బ్యూటిఫుల్ టెంపుల్


పొన్నచెట్టు శిల్పం గురించి వివరిస్తున్న గైడ్ విజయ్‌కుమార్

వెంకటాపురం(ఎం): రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ అని ఇటలీకి చెందిన అలెక్సాండ్రా కొనియాడారు. ఆదివారం మండలంలోని చారిత్రాక రామప్ప దేవాలయాన్ని సందర్శించి రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేయగా టూరిజం గైడ్ విజయ్‌కుమార్ ఆలయ విశిష్టత వివరించారు. సరిగమలు పలికే పొన్నచెట్టు శిల్పంతోపాటు రామప్ప ఆలయానికి సంబంధించిన శిల్పాల గురించి గైడ్ వివరించగా శిల్పాకళా సంపద అద్భుతంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి శిల్పాకళా సంపదను ఇప్పటి వరకు ఎక్కడా చూడలేదన్నారు. రామప్ప శిల్పాలను తన సెల్‌ఫోన్‌లో బంధించుకున్నాడు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

బయ్యారం: ఆర్థిక ఇబ్బందులతో ఓ వివాహిత పురుగుల మందు ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన గుండోజు సైదమ్మ (35)కు 13 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలు జన్మించిన తరువాత ఐదు సంవత్సరాల నుంచి భర్తకు దూరంగా తల్లిగారింటి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి తల్లి తుమ్మలపెల్లి కనకలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

‘మిరప’కు తెగుళ్ల బెడద..

నల్లతామర పురుగు సోకి రాలుతున్న పూత, కాత

● నివారణకు యాజమాన్య పద్ధతులు ● వ్యవసాయ అధికారుల సూచనలు


మన్నెగూడెం సమీపంలో పురుగు సోకిన తోటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లాలో మిరపకు నల్లతామర శాపంగా మారుతోంది. తోటలు కాపు దశలో ఉన్న తరుణంలో నల్లతామర పురుగు జోటలపై విజృంభిస్తోంది. ప్రస్తుతం వరి కోతలు, పత్తి తీసే పనులు పూర్తి కావడంతో తామర పురుగు ప్రభావం మిరప తోటలపై పడుతోంది. మొదటి కాపు దశలో ఉన్న తోటలకు నల్లతామర పురుగు సోకగా ఇగురు, పూతపై ప్రభావం పడడంతో పూత రాలి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. నల్లతామర ప్రధానంగా ఆకులు, పువ్వులపై పెద్ద సంఖ్యలో చేరి రసం పీల్చడంతో ఆకులు మాడిపోతున్నాయి. ఆకుల పైభాగంపసుపు రంగుకు మారి కింది భాగం ముదురు గోధుమ రంగులోకి, పువ్వులు గోధుమ రంగులోకి మారి రాలిపోతాయి. దీంతో కాత గణనీయంగా తగ్గుతుంది. పురుగు కాయ దశలో సోకుతుండడంతో కాయలు గడుసుబారి ఇటుక రంగులోకి మారుతుండడంతో నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది. నల్లతామర పురుగు ఉనికి తొలిదశలో గుర్తించి యాజమాన్య పద్ధతులు పాటిస్తే పురుగు ఉధృతిని అరికట్టే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు.



యాజమాన్య పద్ధతులు..

- అధిక నత్రజని ఎరువులు వాడకుండా పంటలు సిఫారసు చేసిన మోతాదులోనే ఎరువులు వాడాలి
- కలుపు మొక్కలు నిర్మూలిస్తూ తోట మడులను శుభ్రంగా ఉంచాలి.
- తామర పురుగులు బెట్ట, అధిక ఉష్ణోగ్రతల పరిస్థితులలో సోకే అవకాశాలు ఉన్నందున ఎక్కువ నీటి తడులు ఇవ్వాలి.
- నీలిరంగు అట్టలను ఎకరాకు 40 నుంచి 50 వరకు ఏర్పాటు చేయాలి.
- వాతావరణం చల్లగా ఉన్న సమయంలో బివేరియా బెసినియా లేదా లెకానిసిలియం లెకాని 5 గ్రాముల మందును లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలి.
- వేప సంబంధిత మందులైన 5 శాతం వేప గింజల కషాయం లేదా వేప నూనెను పిచికారీ చేయాలి.
- విచక్షణారహితంగా సిఫారసు చేయని పురుగుమందులు వాడొద్దు.
- వాడిన పురుగు మందులు మళ్లీ వాడకుండా మందులను మార్చి సిఫారసు చేసిన మోతాదులోనే మందులను పిచికారీ చేయాలి.
- చివరి అస్త్రంగా సస్యరక్షణ మందులైన సయాంట్రానిలిప్రోల్ 1.2 మి.లీ లేదా స్పైనోసాడ్ 0.2 మి.లీ లేదా ఫిప్రోనిల్ ఎస్‌సీ 2.మి.లీ లేదా ఫిప్రోనిల్ 80 80 డబ్ల్యూజీ 0.2 గ్రాములు లేదా ఫిప్రోనిల్ +ఇమిడాక్లోప్రిడ్ 0.2 గ్రాములు లేదా స్పైనటోరం 1 మి.లీ లేదా స్పైరోటే ట్రమాట్ 0.8 గ్రాములను లీటర్ నీటిని కలిపి మందులను మారుస్తూ పిచికారీ చేయాలి.

తోటను ఆశించిన ఆకుముడుత

● తెగులు కలిగించే వైరస్‌పై సమగ్ర సర్వే


రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రశాంత్

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ రాష్ట్రంలోని మిరప సాగు ప్రాంతాల్లో చిల్లీ లీఫ్ కర్ల్ వైరస్ ఉనికి, ప్రభావంపై మహబూబాబాద్ మండలం మల్యాల గ్రామంలోని జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం ఆధ్వర్యంలో శాస్త్రవేత్త అడ్లూరి ప్రశాంత్ కుమార్ ఆదివారం సమగ్ర సర్వే చేశారు. ఈ సర్వే మిరప సాగు కేంద్రాలుగా ప్రసిద్ధిగాంచిన ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ప్రశాంత్ మాట్లాడుతూ ఈ సర్వే వల్ల చిల్లీ లీఫ్ కర్ల్ వైరస్ వల్ల కలిగే నష్టం వైరస్ వ్యాప్తికి దారి తీసే కారణాలు గుర్తించడం, దీని ప్రభావాన్ని తగ్గించేందుకు సమర్థవంతమైన నిర్వహణ పద్ధతులను రైతులకు సూచించడానికి తోడ్పడుతుందని తెలిపారు. సర్వేలో పరిగణనలోకి తీసుకున్న అన్ని జిల్లాల్లో వైరస్ ఉధృతి ఉన్నట్లు గుర్తించారు. వైరస్‌తో వచ్చే నష్టాన్ని అధిగమించడానికి రైతులు తప్పనిసరిగా వైరస్ నిరోధకత కలిగిన వంగడాలను ఎంపిక చేసుకుని సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తతో పాటు పరిశోధన స్థానం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

తామర పురుగులు సోకిన మిరప రైతులు జాగ్రత్తలు పాటించాలి. పురుగు ఉనికిని ప్రారంభంలో గుర్తించి యాజమాన్య పద్ధతులు పాటిస్తూ సిఫారసు మేరకు పురుగు మందులు పిచికారీ చేసి పంటలను కాపాడుకోవాలి.

\- చాయారాజ్, వ్యవసాయ అధికారి, సీరోలు మండలం

పోలీసుల అదుపులో దొంగలు

● చోరీ జరిగిన 4 గంటల్లోనే కేసు ఛేదన
● పట్టించిన సీసీ ఫుటేజీ

హసన్‌పర్తి : కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయనగర్‌కాలనీలో రెండు రోజుల క్రితం జరిగిన చోరీ ఘటనలో 4గంటల్లోనే పోలీసులు కేసును ఛేదించారు. బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి దొంగలను పట్టుకున్నట్లు సమాచారం. శుక్రవారం మధ్యాహ్నం 12.30గంటల ప్రాంతంలో విజయనగర్‌కాలనీలో ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగింది. కుటుంబసభ్యులు సాయంత్రం 4గంటలకు తిరిగి ఇంటికి వచ్చి పరిశీలించగా సుమారు రూ.4.80 లక్షల నగదు, 20తులాల బంగారు ఆభరణాలు మాయమయ్యాయి. దీంతో సదరు కుటుంబ యజమాని రాత్రి 7గంటల ప్రాంతంలో పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీస్‌ఇన్‌స్పెక్టర్ రవికుమార్,ఎస్సై రవీందర్ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

సీసీ ఫుటేజీల పరిశీలన..

ఇదిలా ఉండగా, ఘటన జరిగిన ఇంటి ఎదుట భవనంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. ఇందులో మధ్యాహ్నం సమయంలో చిత్తు కాగితాలు సేకరించడానికి వచ్చిన ముగ్గురు మహిళలు ఘటన జరిగిన ఇంటి పక్కన ఉన్న గోడ దూకినట్లు నమోదై కనిపించింది

రంగంలోకి పోలీసులు..

సీసీ ఫుటేజీ ఆధారంగా స్థానిక పోలీసులతో పాటు సీసీఎస్ సిబ్బంది రంగంలోకి దిగారు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో దొంగలను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిసింది. ఇందులో ముగ్గురు మహిళలతో పాటు మరో ఓ వ్యక్తి కూడా ఉన్నట్లు తెలిసింది.

చిత్తు కాగితాలకు వచ్చి తాళాలు ఉన్న ఇళ్లు టార్గెట్..

చిత్తుకాగితాలు సేకరించడానికి వచ్చిన ఆ బ్యాచ్ ముందు తాళాలు వేసి ఉన్న ఇళ్లు టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. చోరీకి వచ్చే ఆ బ్యాచ్‌లో ఇద్దరు ఇరువైపులా పరిశీలించగా మరో ఇద్దరు, ముగ్గురు లోపలకి వెళ్లి చోరీకి పాల్పడ్డారని తెలిసింది. వీరిని ఒకటిరెండు రోజుల్లో రిమాండ్‌కు పంపే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నాసిరకం అయోడిన్‌తో అనారోగ్యం

● మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి


మాట్లాడుతున్న సాంబరాజు చక్రపాణి

ఖిలా వరంగల్: నాసిరకం అయోడిన్‌తో అనేక ఆరోగ్య సమస్య ఉత్పన్నమవుతున్నాయని, వెంటనే నిషేధించాలని సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్, మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి డిమాండ్ చేశారు. ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు తనిఖీల్లో విఫలమయ్యారని మండిపడ్డారు. ఈమేరకు ఆదివారం వరంగల్ శివనగర్‌లోని వినియోగదారుల సమాఖ్య ప్రధాన కార్యాలయంలో హైకోర్టు న్యాయవాది మురారి శెట్టి యశ్వంత్‌కుమార్, జిల్లా న్యాయవాది బండి అనిల్‌కుమార్ అధ్యక్షతన వినియోగదారుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. మైక్రో ప్లాస్టిక్ కవర్‌లోని నిల్వ అయోడిన్ హానికరమన్నారు. అయోడిన్ లోపంతో గర్భిణులు, పిల్లలు తీవ్ర మానసిక రోగాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ కవర్‌లోని నిల్వ ఉప్పు వాడకాన్ని పూర్తిగా తగ్గించుకోవాలన్నారు. సమావేశంలో రావుల రంజిత్‌కుమార్, చిలివేరు ప్రవీణ్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ఓ సిటీ వేలం వాయిదా..

● ప్లాట్ల కొనుగోలుకు ముందుకు రాని కొనుగోలుదారులు
● వరుసగా రెండో సారి వాయిదా


కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న వేలం

వరంగల్: కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) ఆధ్వర్యంలో ‘ఓ సిటీ’లో ప్లాట్ల విక్రయానికి ఆదివారం నిర్వహించిన వేలానికి కొనుగోలుదారుల నుంచి స్పందన లభించలేదు. దీంతో తప్పని పరిస్థితుల్లో అధికారులు వాయిదా వేశారు. 45 ప్లాట్ల కోసం వేలం నిర్వహించగా కేవలం 13మంది మాత్రమే టోకెన్లు తీసుకోవడంతో అధికారులు వాయిదా వేసినట్లు తెలిసింది. ఈ ప్లాట్ల కోసం డిసెంబర్‌లో వేలం నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేయగా ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయ కొరవడంతో జనవరి 5వ తేదీకి వాయిదా పడినట్లు తెలిసింది. రెండోసారి నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినా ప్రజాప్రతినిధులు గైర్హాజర్ కావడంతోనే వేలం వాయిదా వేశారని పాల్గొనేందుకు వచ్చిన కొనుగోలుదారులు ఆరోపించారు. ఆదివారం జిల్లాకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క రావడంతో ‘కుడా’ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీంతో వేలం రద్దయినట్లు సమాచారం.

‘ఓసిటీ’ని అభివృద్ధి చేయాలి..

ఓ సిటీ ఏర్పాటు సమయంలో ‘కుడా’ అధికారులు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి అభివృద్ధి చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు సొల్లేటి శ్రీధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు వేలంలో పాల్గొనేందుకు వచ్చిన ‘కుడా’ సీపీఓ అజిత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కరుణాకర్, ప్రభాకర్, సభ్యులు పాల్గొన్నారు.

కేయూ హాస్టళ్ల ఆఫీస్ ఉద్యోగికి షోకాజ్

● కేర్‌టేకర్లను డబ్బులు అడిగారనే ఆరోపణ..

కేయూ క్యాంపస్: ‘వాళ్లను తీసుకోస్తే మనమే డైరెక్ట్‌గా మాట్లాడుదాం.. లేకపోతే మీ కేర్‌టేకర్లు మనిషికి నాలుగువేలు ఇచ్చేయండి లొల్లిపోతది. మీరు దొంగబిల్లులే పెట్టుకొండి.. దొరబిల్లులే పెట్టుకోండి ..ఏమైనా పెట్టుకోండి. నేను సంతకం పెడతాను. ఇంకెందన్నా. నేనింత మంచిగా ఓపెన్‌గా చెబుతున్నా’ అని కాకతీయ యూనివర్సిటీలోని హాస్టల్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఎన్‌జీఓ కేడర్ కీలక ఉద్యోగి ఒకరు ఆ కార్యాలయంలోని సిబ్బందితో ఓ వ్యాపారి సమక్షంలో అన్న మాటలు ఇవి. హాస్టళ్ల కేర్‌టేకర్లు డబ్బులు ఇవ్వాలని ఆ కీలక ఉద్యోగి బాహాటంగా అడిగిన వ్యవహారం రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి దృష్టికి వెళ్లింది. దీంతో సీరియస్‌గా పరిగణించిన మల్లారెడ్డి రెండు రోజుల క్రితం సదరు ఉద్యోగికి షోకాజ్‌నోటీస్ జారీచేశారు. బిల్లులపై సంతకాల కోసం కేర్‌టేకర్లను డబ్బులు ఇవ్వాలని అడిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆ ఉద్యోగికి షోకాజ్ నోటీస్ జారీచేశారు.ఈ విషయంపై ‘సాక్షి’ రిజిస్ట్రార్ మల్లారెడ్డిని వివరణ కోరగా కేర్‌టేకర్లు డబ్బులు ఇవ్వాలనేది ఎన్‌జీఓ కేడర్ ఉద్యోగి (సూపరింటెండెంట్)అడిగినట్లు తన దృష్టికి రాగా ఆ సంబంధిత ఉద్యోగికి షోకాజ్‌నోటీస్‌ను జారీచేసినట్లు వెల్లడించారు. అతడు ఇచ్చే వివరణను బట్టి తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

కేయూ క్రికెట్ విజేత ‘వరంగల్ జోన్’

● విజేతలకు బహుమతుల ప్రదానం


వరంగల్ జోన్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

ఖమ్మం స్పోర్ట్స్ : కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలు నగరంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాలలో ఆదివారం ముగిశాయి. పోటీల్లో వరంగల్ జోన్ జట్టు ఘన విజయం సాధించి టైటిల్ సాధించింది. వరంగల్ – ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం జోన్ నిర్ణీత 30 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. డేవిన్ 43, అజహర్ 29, అభిలాశ్ 12, సంతోశ్ 13 పరుగులు చేయగా వరంగల్ బౌలర్లు హరిప్రసాద్ 3, వైష్ణవ్ 2, ఇబ్రహీం ఒక వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన వరంగల్ జోన్ జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసింది. ఆ జట్టులో విశాల్ యాదవ్ 6 ఫోర్లు, 5 సిక్సర్లతో 68 పరుగులు చేశాడు. ఫర్హాన్ 11, హరిప్రసాద్ 17 పరుగులు చేసి జట్టు విజయానికి సహకరించారు. ఖమ్మం బౌలర్లు నితిన్ 4, అజహర్ 3, శశికుమార్ ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమంలో డీవైఎస్‌ఓ టి.సునీల్ కుమార్ రెడ్డి, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.రమణారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జె.ఉపేందర్, పీడీ రఘునందన్, సెలక్టర్లు ఎం. కుమార్, అఫ్జల్, గోపి, అస్లాం, ఎండి. మతిన్, ఆర్.ఉపేందర్, కమల్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు

ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు షురూ


పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ అమరనాథ్

కేయూ క్యాంపస్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు (ఐదో సీజన్)ఆదివారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాల మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను నిర్వాహకుడు డాక్టర్ అమరనాథ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొంటుందన్నారు. మొత్తం 32 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయన్నారు. ఎప్పుడు వృత్తిలో బిజీగా ఉండే వైద్యులు, సిబ్బందికి ఈ పోటీలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కాగా, తొలిరోజు నాలుగు జట్ల మధ్య పోటీలు జరిగాయి. విజేతకు రూ. 50 వేల నగదు పురస్కారం, ట్రోఫీ, రన్నరప్ జట్టుకు రూ. 30వేల నగదు పురస్కారంతోపాటు ట్రోఫీని అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ప్రాణం మీదికి తెచ్చిన ‘చుట్ట’

● ఆకులు కోస్తూ చెరువులో జారిపడి వృద్ధురాలు మృతి


కోమటి(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ‘చుట్ట’ ప్రాణం మీదికి తెచ్చింది. చుట్ట తాగుడు అలవాటు ఉన్న ఓ వృద్ధురాలు మోదుగు ఆకులు కోసుకునేందుకు వెళ్లింది. ఈ క్రమంలో చెరువులో పడి మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం శివారు వీరారం తండాలో ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికారెడ్డి కథనం ప్రకారం.. తండాకు చెందిన భూక్య కోమటి (75) కి చుట్ట తాగే అలవాటు ఉంది. ఈ క్రమంలో మోదుగు ఆకులు కోసుకుని రావడం కోసం రామసముద్రం చెరువు వద్దకు వెళ్లింది. ఆ ప్రాంతంలో ఉన్న మోదుగు చెట్ల ఆకులు కోస్తుండగా అదే చెరువులో జారి పడి మృతిచెందింది. అటువైపు వెళ్తున్న పలువురు గమనించి కుటుంబీకులు, పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు హుటాహుటిన చేరుకుని కోమటి మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు కిషన్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

బావిలో పడి వృద్ధుడు..


పీరు నాయక్ (ఫైల్)

నెక్కొండ: ఓ వృద్ధుడు వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని అప్పల్‌రావుపేటలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామ శివారు మాన్య తండాకు చెందిన బానోత్ పీరు నాయక్ (62) వ్యవసాయ పనుల నిమిత్తం తెల్లవారుజామున పంట చేనుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన వడ్డె వెంకన్న వ్యవసాయ బావిలో జారి పడి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య నర్సమ్మ, కుమార్తెలు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి..

గార్ల: రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం గార్ల మండలం రాంపురం సమీపంలో చోటుచేసుకుంది. డోర్నకల్ రైల్వే ఎస్సై జె. సురేశ్ కథనం ప్రకారం.. రాంపురం సమీపంలోని దిగువ లైన్‌లో గుర్తుతెలియని రైలు నుంచి జారి పడి గార్లకు చెందిన గోర్రె కృష్ణమూర్తి మృతిచెందాడు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచినట్లు ఎస్సై వెల్లడించారు.

తేనెటీగల దాడిలో మహిళ..


మమత(ఫైల్)

దేవరుప్పుల: తేనెటీగల దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలవగా.. ఓ మహిళ మృతి చెందిన ఘటన దేవరుప్పుల మండలం పెద్దమడూరులో ఆదివారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. పెద్దమడూరుకు చెందిన కేమీడి సాగర్ భార్య మమత(25)తో కలిసి ధారావత్‌తండా శివారు మరిపడిగె స్టేజీ సమీపాన వ్యవసాయ పనులకు వెళ్లారు. పొలం గట్లపై గడ్డి నివారణకు మందు పిచికారీ చేస్తుండగా తొలుత సాగర్‌పై తేనెటీగలు దాడి చేశాయి. అనంతరం సహాయకారిగా వెళ్లిన మమతతోపాటు మరో వ్యక్తిని గాయపర్చాయి. దీంతో మమతను వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

డిప్యూటీ సీఎం కాన్వాయ్‌లో అపశ్రుతి

● అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఎస్కార్ట్ వెహికిల్


చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ఎస్సై ఎస్కార్ట్ వాహనం

జనగామ: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వరంగల్ పర్యటన నేపథ్యంలో ఆదివారం జనగామ ప్రాంతంలో అపశ్రుతి చోటుచేసుకుంది. వరంగల్–హైదరాబాద్ నేషనల్ హైవే జనగామ మండలం పెంబర్తి కాకతీయ కళాతోరణం ముఖద్వారం వద్ద ఎస్సై చెన్నకేశవులు ఆధ్వర్యాన ఎస్కార్టు నిర్వహించారు. ఎస్సై ఎస్కార్ట్ వాహనం ముందుగా వెళ్తోంది. ఈ క్రమంలో కాన్వాయ్‌లోని ఓ వాహనం ఓవర్ టేక్ చేసే సమయంలో ఎస్సై వాహనాన్ని వెనుక నుంచి తాకే ప్రయత్నంలో డ్రైవర్ పక్కకు తీసుకుంటుండగా అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకు వెళ్లింది. ఈ ప్రమాదాన్ని గమనించిన డిప్యూటీ సీఎం ప్రయాణిస్తున్న వాహన డ్రైవర్ ముందుకు వెళ్లిపోగా.. ఎస్సై, ఎస్కార్ట్ వాహనంలోని డ్రైవర్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. సమాచారం అందుకున్న సీఐ దామోదర్‌రెడ్డి ఘటన స్థలికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ఎస్కార్టు వాహనం మాత్రం పూర్తిగా డ్యామేజీ అయ్యింది.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

● రూ. 14,750 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి రూ. 14,750 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో హనుమకొండ, విజయపాల్‌కాలనీకి చెందిన బండా రమణరెడ్డి, కనకదుర్గాకాలనీకి చెందిన పల్లెపాటి రాజిరెడ్డి, శ్రీనగర్‌కు చెందిన ముప్పిడి భాస్కర్, ఉనికిచర్లకు చెందిన మైస ఏలియా, చాపలతండాకు చెందిన గుడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారన్నారు. తదుపరి చర్యల నిమిత్తం వీరిని సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ తెలిపారు. దాడిలో ఇన్‌స్పెక్టర్ బాబులాల్, సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత..

వరంగల్: వరంగల్ చౌర్‌బౌలి ప్రాంతానికి చెందిన వ్యాపారి సింగారపు సతీశ్ వద్ద రూ.20,645 విలువైన నిషేధిత గుట్కాలు, జర్దాలను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వాధీనం చేసుకున్న వస్తువులతో పాటు అదుపులోకి తీసుకున్న సతీశ్‌ను తదుపరి చర్యల నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

7 నుంచి కేయూ దూరవిద్య పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి దూరవిద్య ఎమ్మెస్సీ బాటనీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, మ్యాథ్‌మెటిక్స్ పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 7 నుంచి నిర్వహిస్తున్నారు. 7, 9, 17, 20, 22 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 192 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వర్సిటీలోని విద్యాకళాశాలను పరీక్ష కేంద్రంగా కేటాయించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల హాల్‌టికెట్లు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

కాజీపేట మీదుగా సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

కాజీపేట రూరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా కాజీపేట జంక్షన్ మీదుగా పలు మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు ఆదివారం తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు

జనవరి 6,13వ తేదీల్లో నాందేడ్–కాకినాడ టౌన్ (07487) ఎక్స్‌ప్రెస్, జనవరి 7,14వ తేదీల్లో కాకినాడ టౌన్–నాందేడ్ (07488) ఎక్స్‌ప్రెస్‌లకు సికింద్రాబాద్ తర్వాత కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు. జనవరి 8,11,15వ తేదీల్లో చర్లపల్లి–తిరుపతి (02764) ఎక్స్‌ప్రెస్, జనవరి 912,16వ తేదీల్లో తిరుపతి–చర్లపల్లి (02763) ఎక్స్‌ప్రెస్‌లకు జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు. జనవరి 9,16వ తేదీల్లో కాచిగూడ–తిరుపతి (07655) ఎక్స్‌ప్రెస్, జనవరి 10,17వ తేదీల్లో తిరుపతి–కాచిగూడ (07656) ఎక్స్‌ప్రెస్‌లకు జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించారు.